కథ

# అల్లరిపిల్ల

◆ ఎస్. మోహనహరి ◆

ధీని ధైర్యం పాడుగాను! సైకిల్ మీదున్న చెట్టంత కుఱ్ఱాడి చొక్కా పట్టుకుని చెడామడా చెంపలు వాయించేస్తోంది! సిగ్గు లేకపోతే సరి. ఆడపిల్లకి ఉండాల్సిన లక్షణాలు ఒక్కటంటే ఒక్కటుంటే కదా దీనికి?"

వెన్నెల్లో చిన్న చిన్న కుఱ్ఱాళ్ళతో చెడుగుడు ఆడుతుంటే వయసొచ్చిన ఏ కుఱ్ఱాడైనా ఎగతాళి చేస్తాడు-మరి.

"చిన్న కుఱ్ఱాళ్ళతో ఏం ఆట ఆడతావు. మనిద్దరం ఆడుకుందామా?" అన్నాడట. ఆ మాట విని మరో ఆడపిల్లయితే సిగ్గుతో చచ్చిపోయేది. కానీ ఇదట్లాకాదు. పూనకం వచ్చినదాన్లా వాణ్ని పట్టుకుని వాయించింది.

ఏమిటో! మా కాలం ఆడపిల్లలు తలెత్తి నడిచే వాళ్ళా? నోరిప్పి మాట్లాడేవాళ్ళా?

యీ పిల్లని నేను వచ్చినప్పటి నుంచే గమనిస్తున్నాను.

నేనంటే తల్లిని, ఓర్చుకోగల్ను.

కానీ, నా కోడలు ముందే మా అబ్బాయి ప్రక్కన కూర్చుని పరాచికలాడటం, ఒళ్ళు రాసుకుంటూ, తొడల మీద కొట్టుకుంటూ మాట్లాడుతుంటే నాకు విడ్డూరంగా వుంది. మరో ప్రక్క అరికాలి మంట నెత్తికెక్కుతోంది.

అల్లరిపిల్ల మరీ అంత చనువు ఇవ్వొద్దని కోడలిని హెచ్చరించాను. నా మాట వింటేనా?

"అత్తయ్యా! శ్వేత చాలా మంచి పిల్ల. అమాయకురాలు. మనసులో కల్మషం లేని పిల్ల" అని నవ్వి మాట మారుస్తుంది.

పిల్లట పిల్ల! పెళ్ళయితే ఇద్దరు పిల్లల తల్లి అయ్యేది. అందుకే దాన్ని చూస్తే నా వొళ్ళంతా అసహ్యంతో కంపరం పుడుతోంది.

దాని బాబు సరిపాదించినట్లు ఇంట్లో జొరబడి విచ్చలవిడిగా తిరుగుతోంది. పోనీ-తిరిగిందే అనుకుందాం. పొద్దున్న ముగ్గుపొడి దగ్గర్నుంచీ అన్నీ తీసుకెళ్ళిపోతుంది.

నేను వచ్చిన రోజే గమనించాను దాని సంగతి.

తుఫానులా ఇంట్లోకి వస్తే ఎవరో అనుకున్నాను.

"అక్కా! మా ఇంటికి స్నేహితులొచ్చారు. మడతమంచం, రెండు కుర్చీలు తీసుకెళ్తున్నాను" అంటూ జవాబు కూడా వినిపించుకోకుండా తీసుకెళ్ళిపోయింది.

ఇంకో రోజయితే వంటింట్లో సరాసరి చెప్పులతో దూరి "అక్కా! మా ఇంట్లో కూరేమీ లేదు. వంకాయ కూర తీసుకెళ్తున్నాను" అనేసి గిన్నెడు నిండా కూరేసుకుని వెళ్ళిపోయింది.

ఏమో బాబూ! నాకు మాత్రం ఆ పిల్ల బుద్ధి నచ్చడం లేదు. అయినా మన బంగారం బాగుండాలి గానీ బయటి వాళ్ళ గురించి అనుకొంటే లాభమేముంది?

వదే వదే కోడలిని హెచ్చరించాను.

మళ్ళీ అదే చిర్నవ్వు! అదే సమాధానం!

"అత్తయ్యా! శ్వేతని మీరు అపార్థం చేసుకుంటున్నారు. అది అల్లరి పిల్లలా కనిపిస్తుందే గానీ దాని మనసు వెన్న. నన్ను ఒక్క పని చేయనీయదు. చూస్తున్నారుగా? కూరగాయల దగ్గర్నుంచీ వంట గ్యాస్ వరకు తెచ్చి పెడుతుంది. వద్దన్నా బట్టలు ఇస్త్రీ చేసి పెడ్తుంది."

"అదేనమ్మా నేన్చెప్పేది. ఇలాంటి జాణలు ముందు మచ్చిక చేసుకుంటారు. ఆ తర్వాత ఏకులా ఉండి మేకై కూర్చుంటారు. ఎందుకైనా మంచిది. నువ్వు కాస్త జాగ్రత్తగా ఉండు. అబ్బాయిని బుట్టలో వేసుకున్నా వేసుకుంటుంది. ఆ తర్వాత నీ ఇష్టం" అన్నాను.

"అదేం లేదత్తయ్యా! మీరు కొత్త. అందుకే మీకలా కనిపిస్తోంది. ఆయన ఆఫీసుకెళ్ళాక నేను ఒంటరిగా ఉంటాను. నాకు తోడుగా ఉంటోంది.

నా గుండె గుభేలుమంది.

ఈ రోజుల్లో ఎలాంటి స్వార్థం లేకుండా స్నేహం చేసే పొరుగు వాళ్ళున్నారంటే నేనమ్మను.

సందేహం లేదు. ఇదంతా మా అబ్బాయిని వల్లో వేసుకోడానికి చూస్తోందా పిల్ల.

రహస్యంగా ఆ పిల్ల గురించి ఆరా తీశాను.

చిన్నప్పుడే తల్లిని కోల్పోయింది. తండ్రికి

◆◆◆◆◆

★ "నాకు మాత్రం ఆ పిల్ల బుద్ధి నచ్చడం లేదు. అయినా మన బంగారం బాగుండాలికానీ, బయటి వాళ్ళ గురించి అనుకొంటే లాభమేముంది"

◆◆◆◆◆

రెండో కూతురు. అతనేదో ఆఫీసులో గుమాస్తా ఉద్యోగం చేస్తున్నాడు. పెద్ద కూతురు పెళ్ళి చేసి అప్పుల పాలయ్యాడట! అందుకే ఇలా పొరుగు ఇంట్లో నుంచీ ఉప్పు, పప్పు వగైరాలు పట్టుకుపోతూంది.

నా కోడలు ఒట్టి అమాయకులరాలు. కాబట్టీ దాని ఆటలు సాగుతున్నాయ్. అబ్బాయితో చనువుగా ఉంటుందంటే ఇహ సందేహం లేదు. ఏకంగా సవతిగా మారిపోయి ఇంట్లో తిష్టవెయ్యాలని చూస్తోంది.

ఒకరోజు ఉన్నట్లుండి భరించలేని ఒళ్ళు నొప్పులతో జ్వరమొచ్చి మంచం పట్టాను. దానికి సందు దొరకాలిగానీ ఇట్టే దూరిపోతుంది. డాక్టరుని తీసుకొచ్చింది. నేనెంత వద్దన్నా నా కాళ్ళు ఒత్తుతూ కూర్చుంది. టైముకి మందులిచ్చేది. బలవంతంగా పళ్ళు తినిపించి, పాలు త్రాగించేది.

నాటకం!

పెద్దదాన్ని. నా మనసుని గెలుచుకుంటే ఇహ అడ్డేముందీ? అంతా కుట్ర! నేనేం తక్కువదాన్నా? దాని ఆటలు నా దగ్గర సాగవని దానికి తెలీదు. అలాంటి వాళ్ళని నా జీవితంలో ఎందరినో చూశాను.

★ "ఏదో నాలుగు రోజులుండి పోదామని వచ్చాను. కానీ ఈ అల్లరి చిల్లరి పిల్ల నా కొడుకు సంసారాన్ని ఏం చేస్తుందోనని దిగులు పట్టుకొంది

నా బాధంతా నా కొడుకూ కోడలు గురించే. నేనెంతజెప్పినా నా మాట వినిపించుకోరేమిటీ?

ఏదో నాలుగు రోజులుండిపోదామని వచ్చాను. కానీ ఈ అల్లరి చిల్లరి పిల్ల నా కొడుకు సంసారాన్ని ఏం చేస్తుందోనని దిగులు పట్టుకొంది నాకు.

చెప్పాల్సిందంతా చెప్పాను. నా మాట. విననప్పుడు ఎవరు చేసుకున్న ఖర్మ వాళ్ళు అనుభవిస్తారు.

అందుకే బయల్దేరే ముందు ఆ అల్లరి పిల్ల ముఖం చూడబుద్ధి కాలేదు. ట్రైన్ కదిలేటప్పుడు కోడలిని మళ్ళీ మళ్ళీ హెచ్చరించాను.

ఇంటికి వచ్చానన్న మాటే గానీ నా ఆలోచనలు ఆ రాక్షసి పిల్ల మీదే భ్రమిస్తున్నాయ్.

పది రోజుల తర్వాత అబ్బాయి దగ్గరి నుంచీ ఉత్తరం వచ్చింది.

ఆత్రంగా విప్పి చదవసాగాను.



## కథ

అమ్మా!

నమస్కారము. ఇక్కడ మేము క్షేమంగా ఉన్నాము. కానీ ఇక్కడ ఒక ప్రమాదం జరిగింది. భయపడకు. ఇప్పుడంతా సర్దుకున్నాం.

నేను ఆఫీసుకెళ్ళినప్పుడు ఇంట్లో మీ కోడలు ఒంటరిగా ఉండటం చూసి ఒక దొంగ ఇంట్లోకి దూరాడు. కత్తి చూపించి నగలన్నీ ఇచ్చెయ్యమని బెదిరించాడు.

మీ కోడలు వణికిపోతూ నగలన్నీ తీసి అతని చేతిలో పెడుతుంటే దేవతలా శ్వేత ఇంట్లోకి వచ్చింది. పరిస్థితి గమనించింది.

మగాళ్ళు చేయలేని ధైర్యం చేసింది.

దొంగతో కలబడింది. శ్వేత దొంగని పట్టుకుని చితకబాదింది. కానీ ఆ గలాటలో దొంగ, కత్తితో శ్వేత కుడి భుజంలో పొడిచాడు. దొంగని పట్టుకున్నారు. శ్వేతని హాస్పిటల్‌కి తీసుకెళ్ళాం.

భగవంతుని దయవల్లా ఇప్పుడా పిల్ల క్షేమంగా ఉంది. గాయం బలమైనది కాబట్టి ఇంకా హాస్పిటల్లోనే వుంది.

అమ్మా! శ్వేత అంత గాయపడినా కళ్ళు తెరచిన వెంటనే మీ కోడలి గురించి ఆందోళన పడింది. అలాంటి అమ్మాయి మా ప్రక్కింట్లో ఉండటం మా అదృష్టం!

అమ్మా! శ్వేత ముఖ్యంగా మరో విషయంలో బాధపడుతోంది. నిన్ను మాటి మాటికి గుర్తు చేస్తోంది. నువ్వు వెళ్ళేటప్పుడు చెప్పి వెళ్ళలేదని ఏడుస్తోంది.

నువ్వేమి దిగులు పడకు. ఇప్పుడు అందరూ క్షేమంగా ఉన్నారు.

నాన్నగారికి నమస్కారములు.

మీ కొడుకు

శ్రీకాంత్‌రావు.

ఉత్తరం చదివాక నాకిక ఉండబుద్ధి కాలేదు. ఉన్న ఫళంగా బయల్దేరాను. కోడలు నవ్వుతూ ఆహ్వానించింది. సంతోషంలో ఏడు కొండల వాడికి సహస్ర నమస్కారాలు పెట్టుకున్నాను మనసులో.

సాయంత్రం ముగ్గురం హాస్పటల్‌కెళ్ళాము.

నన్ను చూడగానే శ్వేత ఏడ్వడం మొదలెట్టింది.

నేనా అమ్మాయి తల మీద చెయ్యేసి నిమురుతుంటే తను నా ఒళ్ళో తల పెట్టి మరింత వెక్కి వెక్కి ఏడ్వడం మొదలెట్టింది.

శ్వేత ఏడుపు చూడటం నాకు మొదటిసారి. ఆ ఏడుపులో ఎలాంటి కల్మషం, స్వార్థం, నటన కనిపించడం లేదు.

శ్వేత ఒక దేవతలా కనిపిస్తోంది.

"నేనూ, నా ప్రవర్తనంటే నీకిష్టం లేదు కదూ? అందుకే చెప్పకుండా వెళ్ళిపోయావు. అమ్మా! నేను నీ బిడ్డలాంటిదాన్ని. నా మనసులో ఎలాంటి చెడు ఆలోచనలు లేవమ్మా. నిజం. చిన్నప్పటి నుంచీ ఇతరుల సుఖదుఃఖాలలో పాలు పంచుకోవడం అలవాటయిపోయింది. నా వల్లా ఏదైనా తప్పైతే క్షమించమ్మా."

శ్వేత కన్నీళ్ళతో నా చీర తడిసిపోతోంది.

దుఃఖం ఆపుకోలేకపోయాను.

"అమ్మా! శ్వేతా! తప్పుచేసింది నువ్వు కాదమ్మా. నేను. నేను తప్పు చేశాను. నీ గురించి ఏమిటేమిటో వూహించుకుని అపార్థం చేసుకున్నాను. నన్ను క్షమించు తల్లీ."

శ్వేతని నా గుండెలకి హత్తుకున్నాను.

అప్రయత్నంగా నా కళ్ళ నుంచీ కన్నీరు బుగ్గల మీదికి జారుతుంటే "అదిగో నువ్వు కూడా ఏడుస్తున్నావ్. పో, నీతో మాట్లాడను" అంటున్న శ్వేతని చూస్తుంటే నిజంగా నా కన్న బిడ్డలా కనిపించింది.

దుఃఖంలో నవ్వు, నవ్వులో దుఃఖం మిళితమైన ప్రేమానురాగాలు నా గుండె పొరలలోంచి ఉబికి వస్తుంటే శ్వేతని మరోసారి గుండెలకి హత్తుకున్నాను.



## స్నేహమంటే అదే!

రాకేష్ రోషన్ ఒకప్పుడు చాలా పాపులర్ నటుడు. ఈ మధ్య అతని చిత్రాలు రెండు అపజయాన్ని చవి చూసేసరికి అతనిలో కొంత నిరాశ చోటు చేసుకొంది. క్రిందటి నెల అతని కుమార్తె పెళ్ళికి పరిశ్రమలోని ప్రముఖులందరూ రాకపోయినా అతని ఆప్తమిత్రులయిన జితేంద్ర, రిషీకపూర్, సుజిత్‌కుమార్, ప్రేమ్ చోప్రాలు వచ్చి తాము ఆడపిల్ల వారిగా నిలబడి పెళ్ళి జరిపించారట! జితేంద్ర భార్య 'శోభ' నెల రోజులు ముందు నుంచి పెళ్ళిపనులన్నీ దగ్గరుండి చేయించిందట.


### తెల్ల మచ్చలు

మా యొక్క చికిత్సా విధానము ద్వారా భారతదేశములోని ప్రతీ ప్రాంతములో మా వేలాది రోగులు పూర్తిగా నయము చేయబడినారు. ఎన్నో ఏళ్ళుగా ఎంతో శ్రమతో కూడిన పరిశోధన తరువాత దిగ్విజయముగా స్వీకరించబడినది. ఈ చికిత్స ఎంతో సమర్థవంతమైనది మరియు మాయొక్క చికిత్సను ప్రారంభించిన పదిహేను గంటల లోపుగానే తెల్లమచ్చలను మాసిపేయు నంత శక్తిగలది. అప్పటి నుండి త్వరలో ఒక్క రోజులలోగా మిమ్ములను అంతర్గతముగా అది బాగుచేస్తుంది. చికిత్సకు పూర్తి గ్యారంటీ కలదు. మీరు 7 రోజుల కొరకు మందును మా నుండి ఉచితముగా పొందవచ్చును. మరెక్కడైనా చికిత్స పొందినాగాని ఫలితము లేక నిరాశకు గురైనమా సరే, ఒక దఫా మా మందును వాడి చూడండి. సదరు ఉత్తరములో వ్యాధి పీడితులు తప్పనిసరిగా వయస్సు, ప్రదేశము, మరియు వ్యాధి కాలమును పేర్కొనవలెను.

Vaidya M.K.Mathur (M.K.W.9)

P.O. KATRISARAI (GAYA)

### తెల్లజుట్టు మరియు చిన్న వయస్సులోనే జుట్టురాలుట కొరకు చికిత్స

దైని వెంటనే ఆనతంపదేపి మా ఆయుర్వేద చికిత్సా విధానాన్ని ప్రారంభించండి. అనేక సంవత్సరాలుగా మాయొక్క పరిశోధనా బృందముచే వ్యయ ప్రయాసంకోర్చి పరిశోధించిన పిమ్మట విజయవంతముగా స్వీకరించబడినది. ఇది వయస్సు మళ్ళకముందే జుట్టు రాలుటను మరియు తెల్లబడుటను మాయొక్క చికిత్స ద్వారా అది నిరోధిస్తుంది. బట్టతలను అది నియంత్రిస్తుంది. కొత్తగా జుట్టు ఎదుగుటకు కూడా అది సాయము చేస్తుంది. మీ మేధాశక్తి మరియు దృష్టిని పెంపొందింపుటకు ఇది సహాయపడుతుంది. రోజంతా మీ మెదడు తాజాగా, అలసట లేకుండా, ఉత్సాహముగా ఉండుటకు ఇది దోహదపడుతుంది. మీ కేశములు మృదువుగా, ఒత్తుగా మరియు ఎప్పుడూ నిగనిగలాడేట్టుగా ఉండేందుకు కూడా అది సహాయపడుతుంది. కనుక, సోదర, సోదరీమణులారా, ఎలాంటి ఫలితాలు లేనటువంటి చికిత్సను మీరు మరెక్కడైనా పొంది ఉన్నా, మీరు మా చికిత్సను పొందవచ్చు. ఒకసీసాకు ధర రూ. 25/- లు 3 సీసాలకు రూ. 70/- లు.

Vaidya M.K.T. Mathur (M.K.T.9)

P.O. KATRISARAI (GAYA)